రూ.55.75 లక్షలతో అభివృద్ధి పనులు



అశోక్‌నగర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కటుమూరి సతీష్, శశికళ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం అశోక్‌నగర్, జాషువానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు గురువారం వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు శంకుస్థాపను చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ.55.75 లక్షలతో ఈ ప్రాంతాల్లో డ్రైనేజీలు, గెడ్డలు, సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్లు డీఈ భరణికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. గత నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, పార్టీ వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్, డి.శ్రీనివాసరావు, నాయకులు గంగా మహేష్, సురేష్, బద్రి, దివాకర్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

'గుడ్ మార్నింగ్ నార్త్'లో కె.కె.రాజు



48వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో సమస్యలు పరిశీలిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: గుడ్ మార్నింగ్ నార్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 48వ వార్డు ఊర్వశి జంక్షన్, బర్మా క్యాంప్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించారు. ఊర్వశి జంక్షన్ నుంచి బర్మాక్యాంప్, శ్రీనివాసనగర్, మధుసూదన నగర్ వరకు రూ.2.16 కోట్లతో నూతనంగా నిర్మించిన 40 అడుగుల బీటీ రోడ్డును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, డీఈ భరణికుమార్, ఏఈ సాయినాథ్, నాయకులు గంగరాజు, రాంబాబు, శ్రీను, కిషోర్, శివరామ్, అప్పారావు, పద్మా, నరేష్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఆయనకు తెలియజేసి వినతిపత్రాలు అందజేశారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బీఎల్‌ఏలు, నాయకులతో సమావేశం



సచివాలయ సిబ్బందికి కానుకలు అందిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు, పైడి రమణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వాసుదేవనగర్ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో గురువారం పోలింగ్ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు వారికి దిశానిర్దేశం చేశారు. బీఎల్‌ఏలు, ముఖ్య నాయకులు, సచివాలయ సిబ్బందికి ఆయన సంక్రాంతి కానుకలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, నాయకులు హరిపట్నాయక్, నాగరాజు, నేపాల్ శ్రీను, సన్ని, నాయుడు, దుర్గ, నాని, ఆదిలక్ష్మి, సువర్ణ, నరసారావు, చిన్నారావు, పైడి శ్రీను, గణపతి, ప్రభాకరరావు, సతీష్, బాబూరావు, రాజు, సత్యానందంరెడ్డి, గోవింద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేశారు. వార్డు కార్యాలయంలో గురువారం యూపీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్, ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న వైద్యంలో భాగంగా వార్డులోని అన్ని సచివాలయాల పరిధిలోని వారికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ చేతుల మీదుగా అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేశారు. ఏఎన్‌ఎంలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మలుపుల్లో ఆటోల నిలిపివేత



సత్యం జంక్షన్ మలుపు వద్ద నిలిపివేసి ఉన్న ఆటోలు

సీతమ్మధార: సత్యం జంక్షన్ సిగ్నల్ పాయింట్ మలుపుల వద్ద ఇష్టానుసారంగా ఆటోలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. గురుద్వారా నుంచి సీతమ్మధార రోడ్డులోకి వెళ్లే మార్గం(మలుపు) వద్ద ఆటోలు నిలిపివేయడంతో వాహన చోదకులకు, ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటోంది. ట్రాఫిక్ పోలీసులు అక్కడే విధులు నిర్వహిస్తున్నా.. పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో ప్రమాదాలకు దారితీస్తోంది. పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'యాత్ర-2' విజయోత్సవ సంబరాలు



కేకు తినిపిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యదార్థ గాథగా తెరకెక్కించిన 'యాత్ర-2' సినిమా గురువారం విడుదలై సూపర్ హిట్ కావడంతో బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని మించిన తనయుడిగా వైఎస్ జగన్ చిరస్థాయిలో నిలిచిపోతరన్నారు. యాత్ర-2 సినిమాలో నటించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. దర్శకుడు అద్భుతంగా ఈ చిత్రాన్ని తీశారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, కిరణ్‌రాజు, అంబటి శైలేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఊర్వశి థియేటర్ వద్ద సందడి



ఊర్వశి థియేటర్ వద్ద సినిమా విజయోత్సవంలో కె.కె.రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: యాత్ర-2 చిత్రంలో రాజన్న ఆశయం-జగనన్న లక్ష్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. కంచరపాలెం ఊర్వశి థియేటర్‌లో గురువారం విడుదలైన యాత్ర-2 సినిమా మొదటి షోను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినిమాలోని ప్రతి సన్నివేశం సీఎం వైఎస్ జగన్ పేద, మధ్యతరగతి ప్రజలకు మంచి చేయాలన్న దృక్పథం, తపన నేరుగా చూసిన అనుభూతి కలిగిందన్నారు. పదవీ వ్యామోహంతో ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. అనంతరం యాత్ర-2 చిత్రం విజయోత్సవంలో భాగంగా థియేటర్ ఆవరణలో కేక్ కట్‌చేసి, బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్‌లోని 11 కేవీ వుడా చిల్డ్రన్ పార్క్ ఫీడర్, 11 కేవీ ఏఎస్సార్ నగర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్-1 ఈఈ సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏఎస్సార్ నగర్, వోల్వో ఆఫీస్, మైత్రి ఇన్నా, వుడా చిల్డ్రన్ పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మర్రిపాలెం సెక్షన్ పరిధిలో..

మురళీనగర్: జోన్-2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఈపీఎఫ్ క్వార్టర్స్, కరాసా, రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్‌ల్లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ టీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివాని పాఠశాల రహదారి, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, రైల్వే క్వార్టర్స్, మర్రిపాలెం మెయిన్ రోడ్, గవర వీధి, గొల్లవీధి, రానాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హౌస్సేన్‌నగర్, భారత్ పెట్రోలియం బంక్ లైన్, రామాలయం వీధి, ఓల్డ్ కరాసా, న్యూ కరాసా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన ముఖ్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు

మర్రిపాలెం: మహిళలు ఆరోగ్య సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కుశల్ మిత్రా ప్రాజెక్ట్ కమ్యూనిటీ కో ఆర్డినేటర్ ఎం.వరలక్ష్మి అన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో విప్రోకేర్ సహకారంతో 'కుశల్ మిత్ర' కార్యక్రమంలో భాగంగా గురువారం 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు నిత్యం వైద్య పరీక్షలు చేయించుకోవాలని, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు తమ చిన్నారులకు ఆరు నెలల వరకు తప్పకుండా తల్లిపాలు అందించాలని సూచించారు. కౌమార దశ నుంచి మెనోపాజ్ వరకు మహిళలు వ్యక్తిగత శుభ్రత పాటించడంతోపాటు పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మాలా బీబీ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ హైస్కూల్‌ను సందర్శించిన పర్యవేక్షణాధికారులు



ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎంఈవో రామారావు, పర్యవేక్షణాధికారులు

సీతంపేట: రాష్ట్ర విద్యా శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అభ్యసనాభివృద్ధి(లిప్) కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో పర్యవేక్షణపై జిల్లా పర్యవేక్షణాధికారులను నియమించారు. సీతమ్మధార మండల ఎంఈవో రామారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎం.వి.ధర్మారావు(తెలుగు), పి.హరి సుశీల(ఇంగ్లిష్), టి.రమణ(గణితం), రియాజ్ అహ్మద్(సైన్స్) పర్యవేక్షణ అధికారులు(డీఆర్‌పీ)గా నియమితులయ్యారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌ను గురువారం డీఆర్‌పీ బృందం సందర్శించింది. ఉపాధ్యాయుల పనితీరుతోపాటు పాఠ్య ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు, బోధనాభ్యసన సామగ్రి, టీచింగ్ డైరీలు, లిప్ పత్రాలు, పిల్లల ప్రగతి నమోదు రిజిస్టర్లను సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామారావు పర్యవేక్షక అధికారులకు, ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ

- సీసీ కెమెరాల ఏర్పాటుతో ఇంటికి రక్షణ
- దొంగతనాల కట్టడికి రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా
- ఈస్ట్ క్రైం సీఐ ఆదాం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈస్ట్ క్రైం సీఐ ఆదాం

సీతమ్మధార: ప్రజలందరి సహకారంతోనే నేరాలను నియంత్రించవచ్చని ఈస్ట్ క్రైం సీఐ ఆదాం అన్నారు. ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌కు సంబంధించి అబిద్‌నగర్ షాదిఖానా ఫంక్షన్ హాల్‌లో గురువారం నేర నియంత్రణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అపార్ట్‌మెంట్, గ్రూప్ హౌస్, ఇళ్లకు రక్షణ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమన్నారు. నగరంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వాలని కోరారు. ఊళ్లు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని, విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లు, స్నేహితుల ఇళ్లలో భద్రంగా పెట్టుకోవాలని సూచించారు. మహిళలు వాకింగ్‌కు వెళ్లేటప్పుడు బంగారు నగలు కనిపించకుండా చూసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి పూట తమ వాహనాలకు నాణ్యమైన లాక్ వేసుకోవాలన్నారు. నైట్ బీట్ కానిస్టేబుళ్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంట్లో పనిమనిషిని చేర్పించుకునేటప్పుడు వారి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, ఫొటో గుర్తింపు కార్డు తీసుకోవాలని సూచించారు. బంగారు నగలకు మెరుగు పెడతామంటూ కొందరు వ్యక్తులు మోసం చేస్తుంటారని, అటువంటి వాళ్లను నమ్మవద్దన్నారు. బైక్ భద్రతకు రిమోట్‌లాక్, జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం, వీల్ లాక్ వంటి ఆధుని పద్ధతులను ఉపయోగించాలన్నారు. తద్వారా దొంగల బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. ఆటోలో విలువైన వస్తువులతో ప్రయాణిస్తే జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రైం ఎస్‌ఐ భాస్కరరావు, టూ టౌన్ ఎస్‌ఐ డి.అప్పారావు, మహరాణిపేట ఎస్‌ఐ ఎ.సత్యారావు, ప్రెసిడెంట్ ఎం.డి.అబీబ్, సెక్రటరీ యాసిన్, స్థానికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో రైతుబజార్‌లో జేబు దొంగతనాలు, సెల్‌ఫోన్ దొంగతనాలు జరిగేవి. రైతుల డబ్బులు పోయిన సంఘటనలు జరగడంతో మార్కెటింగ్ శాఖ అధికారులకు ఈవో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. దీంతో స్పందించిన అధికారులు 16 సీసీ కెమెరాలను అమర్చారు. స్టాల్స్, గేట్లు, చుట్టుపక్కల అన్ని మూలల్లో వాటిని ఏర్పాటు చేశారు. నిఘా నేత్రాల నుంచి దొంగలు తప్పించుకునే పరిస్థితి ఉండదు. దీంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈవో కార్యాలయంలో మానిటరింగ్ ద్వారా వీటిని పర్యవేక్షిస్తున్నారు.

11న శ్రీనివాస కల్యాణోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభాకర్, రాజశేఖర్

సీతంపేట: శృతిలయ సాంస్కృతిక భక్తి సేవా సంస్థ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 11న సీతమ్మధార టీపీటీ కాలనీ ద్రావిడ సంక్షేమ సంఘం శ్రీలలితా నూకల కామేశ్వరి కల్యాణ మండపంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమ కరపత్రాలను గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్‌లు మాట్లాడుతూ ఈ నెల 10న ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు కల్యాణ వేదిక వద్ద అన్నమయ్య సంకీర్తన రవళి పేరిట ద్వారం త్యాగరాజు శిష్య బృందంచే సంగీత కచేరి, కోలాటం, కూచిపూడి నృత్యం, వేణుగానం, వీణా నాదన, శృతిలయ సభ్యులచే అన్నమాచార్య సంకీర్తన గానం జరుగుతాయని తెలిపారు. 11వ తేదీ ఉదయం 9 గంటలకు సీతమ్మధార త్రిమూర్తిక వేంకటేశ్వర ఆలయం నుంచి కల్యాణ వేదిక వరకు తిరువీధి మహోత్సవం, సాయంత్రం 5.25 గంటలకు వైఖానస ఆగమ సంప్రదాయంలో పి.రంగనాథ ఆచార్యుల బృందం శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తారని చెప్పారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్.వి.సత్యనారాయణ, కొణతాల రాజు, ఎం.ఎస్.మాధవ్, ఫణిస్వామి, మస్తాన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు



అన్నదానం ప్రారంభిస్తున్న అడిషనల్ జిల్లా జడ్జి మహదాస్ శ్రీహరి దంపతులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం బాబాకు ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం హారతి సమర్పించిన అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు 4వ అడిషనల్ విశాఖ జిల్లా జడ్జి మహదాస్ శ్రీహరి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. సుమారు 350 మంది భక్తులు, పేదలు, యాచకులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న ఓమ్ని ఆర్కే హాస్పిటల్ సిబ్బంది

ఉచిత వైద్య శిబిరం

ధ్యాన మందిర ప్రాంగణంలో ఓమ్ని ఆర్కే హాస్పిటల్, మంగమ్మ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మందిర సిబ్బందితోపాటు సుమారు 140 మంది భక్తులు వైద్య సేవలు పొందారు. చిన్నారులు, పెద్దలకు పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



బ్యానర్లు ప్రదర్శిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు

కంచరపాలెం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, నెహ్రూ యువ కేంద్రం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్) సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి ఏడీసీపీ(ట్రాఫిక్) జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భద్రతా నియమాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాణిక్య కుమారి, డాక్టర్ షైజీ, అధికారులు ఎస్.నాగేశ్వరరావు, బాలరాజు, ఎం.ప్రసన్న, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

46వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు సూరిబాబునగర్, శ్రామిక్‌నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో గురువారం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పర్యటించారు. 25 ఏళ్ల నాటి అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉండటంతో ఇటీవల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ పనులను వేగవంతం చేసి మార్చి నాటికి భవనం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డీఈ భరణికుమార్ డిప్యూటీ మేయర్ ఆదేశించారు. వార్డులో జరుగుతున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, మెట్ల మార్గాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఉమా, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాగారపు నరేష్ నాయకులు చిన్నా, అప్పారావు, కృష్ణ, రామారావు, లావణ్య, రాజు, దేవి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ కోర్సుల రంగంలో ఉపాధి అవకాశాలు



సంఘం రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ పి.జె.రావు, ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: పరిశ్రమల్లో సేఫ్టీ కోర్సుల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రొఫెసర్ పి.జె.రావు సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన సేఫ్టీ కోర్సుల పూర్వ విద్యార్థుల సంఘం గురువారం ఏర్పాటు చేసిన సందర్భంగా మొట్టమొదటి ఎగ్జిక్యూటివ్ సమావేశంలో గౌరవాధ్యక్షుడి స్థానంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం సేఫ్టీ కోర్సుల రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల ఆధారిత సేఫ్టీ కోర్సులతోపాటు సాధారణ సేఫ్టీ కోర్సులు కూడా కాలేజీలో నిర్వహించడం హర్షనీయమన్నారు. వెంకటరమణ మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా తమ కాలేజీలో నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకుని ఉన్నత అవకాశాలు పొందారని తెలిపారు. రాష్ట్రంలోనే టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ద్వారా సేఫ్టీ కోర్సులు నిర్వహిస్తున్న మొట్టమొదటి కాలేజీగా గైస్ గుర్తింపు పొందినట్లు చెప్పారు. సెంట్రల్ బోర్డ్ కమిటీ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ బోర్డ్ సభ్యుడిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ పి.జె.రావును ఘనంగా సత్కరించారు. కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఇతర విభాగాధిపతులు, కమిటీ సభ్యులు కె.శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన సినిమా దినోత్సవం



మాట్లాడుతున్న నరవ ప్రకాశ రావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు సినిమా దినోత్సవం గురువారంతో విజయవంతంగా ముగిసింది. హెచ్.ఎం.రెడ్డి దర్శకత్వంలో భక్తప్రహ్లాద సినిమా విడుదలై సంచలనం సృష్టించిన సందర్భంగా ఈ ఉత్సవాలను ఏర్పాటు చేశారు. పౌర గ్రంథాలయం హాల్‌లో బంగారు పాప, జయభేరి, బలగం సినిమాలను ప్రదర్శించారు. ముగింపు సమావేశంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా చిత్రోత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఉత్సవాలు టూరిజం ఆదాయ వనరులుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్‌ఏడీ పాల్, ఉపాధ్యక్షులు కాశీవిశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, హుస్సేన్‌న్ చాట్ల బాబూరావు రెడ్డి, ఉషారాణి, డాక్టర్ బాబ్జీ పాల్గొన్నారు.

సచివాలయాల్లో రికార్డులు పరిశీలించిన తహసీల్దార్



అల్లూరి జంక్షన్‌లోని సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ మండల పరిధిలోని వార్డు సచివాలయాలను గురువారం తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరామమూర్తి సందర్శించారు. అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లోని 111 సచివాలయంలో ఓటర్ జాబితాలు, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 సచివాలయాలను పరిశీలించామన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా అర్బన్ మండలంలోని అర్హులకు ప్రభుత్వం ఇచ్చిన ఒక సెంట్ భూమికి సంబంధించి పట్టాలు తీసుకున్న వారికి రెగ్యులరైజేషన్ చేసినట్లు తెలిపారు. సచివాలయ అడ్మిన్‌లతో కొద్దిసేపు చర్చించారు. కార్యక్రమంలో వీఆర్వో పొన్నాడ నాగేశ్వరరావు, సచివాలయ అడ్మిన్, వీఆర్వోలు పాల్గొన్నారు.